క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


పద్మజ


గోవిందరాజులు

విజయనగరంఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ అల్లు పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఈమె బదిలీపై ఇక్కడకు రాగా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి సక్రమంగా సేవలు అందేలా చూస్తానని, ఆస్పత్రిలో చేరిన రోగులకు సకాలంలో వైద్యం అందేలా చూస్తారని ఆమె తెలిపారు.

విజయనగరం అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకులుగా పి.గోవిందరాజులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు ఆ శాఖ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో నెలకొన్న పాత్రికేయుల సమస్యలను కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

మహాన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పూసపాటిరేగ: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మధుర మత్స్యవాని పాలెంలో మహా అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బావిశెట్టి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నప్రసాదం వడ్డించిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పైడి రవి, బొల్లు రమేష్, లంకలపల్లి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ


గీతాలాపన చేస్తున్న సన్యాసమ్మ

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో స్త్రీల వైద్య నిపుణురాలు, కళాశాల విద్యార్థిని డాక్టర్ జి.సన్యాసమ్మ శుక్రవారం చేసిన గాత్ర కచేరీ అలరించింది. ఈమె గీతాలాపనకు తగిన విధంగా పి.సురేష్‌కుమార్, వి.గణేష్‌లు వయోలిన్, మృదంగం వాయిస్తూ సహకరించారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

దీపారాధన


శివలింగం ఆకారంలో వెలిగించిన దీపాలు

రేగిడి: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వన్నలి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం దీపారాధన చేశారు. మహిళలు శివలింగం, ఓంకారం, స్వస్తిక్, తదితర ఆకారాల్లో దీపాలను వెలిగించారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సంతకవిటి: సిరిపురం గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న బాలాజీ ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా దుకాణం నిర్వహిస్తున్నట్లు ధ్రువీకరించి దుకాణంలోని రూ.31,553 విలువ చేసే ఎరువులు, రూ.79,669 విలువ చేసే పురుగు మందులను సీజ్ చేశామని ఏఓ యశ్వంత్‌రావు తెలిపారు. తనిఖీల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ఎర్రంనాయుడు, ఎస్ఐ బి.రామారావు పాల్గొన్నారు.

ప్రయాణ అవస్థలు!

- అరకొరగా బస్సు సర్వీసులు
- కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థుల అవస్థలు
- తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు


పూసపాటిరేగలో బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పూసపాటిరేగ: విద్యార్థులకు ప్రయాణ అవస్థలు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సు సర్వీసులు తక్కువగా ఉండడంతో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం కళాశాలకు వెళ్లేటప్పుడు..సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు బస్సు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు ఏమైనా(ప్రమాదం) అయితే గానీ స్పందించరా అని అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే బస్సుల సంఖ్య పెంచాలని, అవసరమైతే విద్యార్థుల కోసం కొన్ని ప్రత్యేక బస్సులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ..

సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థుల రాకపోకలు ఎక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు నిలుపుదల చేసే ప్రాంతాలు అత్యంత రద్దీగా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో ఆయా సమయాల్లో వీలైనన్ని ఎక్కువ బస్సులు నడపాలని, అలా అయితే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటలు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పూసపాటిరేగ కూడలి నుంచి రణస్థలం, చింతపల్లి, తిప్పలవలస, భోగాపురం వైపు వెళ్లే బస్సుల్లో ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే బస్సుల కొరత కారణంగా గంటల కొద్దీ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందని ఒక బస్సును వదిలేస్తే తర్వాతి బస్సు కోసం గంట కాలం వరకు వేచి చూడాలి. ఈ క్రమంలో కళాశాలకు సమయం అయిపోతోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సరిపడా బస్సులేవీ?

పూసపాటిరేగలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 5 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరితో పాటు పనులకు వెళ్లే వారు, క్యాంపులు వెళ్లే వారు, పరిశ్రమల్లో పనిచేసే వారు ఇలా నిత్యం గ్రామాల నుంచి ఇక్కడికి బస్సుల్లో రావాలి. వారందరికీ సరిపడా బస్సులు లేకపోవడంతో వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. బస్సు దొరికితే.. సీటు దొరకదు.. సీటు దొరికితే గాలి ఆడదు అనే రీతిలో వ్యవహారం తయారైందని అందరూ అభిప్రాయపడుతున్నారు.

రోజూ నిల్చొని ప్రయాణిస్తున్నా..

ప్రతిరోజూ పూసపాటిరేగలోని కళాశాలకు బస్సులో వస్తున్నా. ప్రతిసారి బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. దీంతో సీటు దొరక్క రోజూ బస్సులో నిల్చొని ప్రయాణిస్తున్నా. ఒక్కోసారి కొంతమంది ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. లేదంటే సమయానికి కళాశాలకు వెళ్లలేం. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులు ఎక్కువగా ఉండేలా చూడాలి.

-కె.హర్ష, విద్యార్థి, భీమవరం

ఘనంగా గురుపూజోత్సవం


డెంకాడ: జిల్లా కేంద్రంలో జరిగిన గురుపూజోత్సవంలో ఉపాధ్యాయుడు లీలాకృష్ణను సత్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

గురుపూజోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. సాధారణమైన ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతిగా ఆయన ఎదిగిన విధానాన్ని మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ వృత్తికి ఎంతో వన్నె తెచ్చిన ఆయన జీవితం ఆదర్శనీయమైనదని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అలాగే అజ్ఞానమనే అంధకారం తొలగించి విజ్ఞానమనే వెలుగును ప్రసాదించేవారు గురువులని వారిని తప్పనిసరిగా గౌరవించుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులను సన్మానించారు.

–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్


విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన గురుపూజోత్సవంలో చిన్నారుల నృత్య ప్రదర్శన


విజయనగరం: జిల్లా కేంద్రంలో శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్కారం పొందిన ఉపాధ్యాయులు


విజయనగరం ఫోర్ట్: జొన్నగుడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, మహిళా ఉపాధ్యాయుల వేషధారణల్లో అలరించిన చిన్నారులు


విజయనగరం గంటస్తంభం: జిల్లా కేంద్రంలోని దండుమారమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు బాబ్జీ


విజయనగరం టౌన్: జిల్లా కేంద్రంలో గురువులను సన్మానించిన బృందావనం అపార్ట్‌మెంట్ వాసులు


పూసపాటిరేగ: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చెట్లు నరికివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విజయనగరం అర్బన్: ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సర్కిల్ ప్రాంగణంలోని వేప, పనస, మామిడి, బాదం చెట్ల నరికివేతపై ఎస్.కోటకు చెందిన న్యాయవాది, పర్యావరణ ప్రేమికుడు బొబ్బిలి రామకృష్ణ శుక్రవారం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారని, ఏపీ వాల్టా చట్టం-2002 ప్రకారం నరికిన ఒక్కో చెట్టుకు రూ.లక్ష జరిమానా విధించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను గుర్తుచేశారు. వెంటనే విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తక్షణమే ఒప్పందాలు అమలు చేయండి

నెల్లిమర్ల: కార్మిక శాఖ అధికారుల వద్ద ఫిబ్రవరి 10 న చేసుకున్న ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక జ్యూట్‌మిల్లు గేటు వద్ద కార్మికులతో శుక్రవారం సమావేశమై మాట్లాడారు. మిల్లు లాకౌట్ చేసి 10 నెలలు, మిల్లు తెరిచి 6 నెలలు గడుస్తున్నా మిల్లు యాజమాన్యం చేసిన ఒప్పందాలను అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. జ్యూట్ యాజమాన్యం 2016 నుంచి 1200 మంది రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు చెల్లిస్తానని చెప్పి ఇంత వరకు చెల్లించలేదని, అంతేకాకుండా 2023-24 రిటైర్డ్ కార్మికుల నుంచి మిల్లు యాజమాన్యం వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఫలితంగా రిటైర్డ్ కార్మికులకు పింఛన్, ఈఎస్ఐ సదుపాయాలు అందడం లేదన్నారు. విధుల నిర్వహణలో మృతి చెందిన వారితో పాటు రిటైర్డ్ కార్మికులను తొలుత ప్రాధాన్యమిచ్చి, వారి గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


శివ్వాంలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ కన్నబాబు

వంగర: వరి పంటను ఆశించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ తట్టికోట కన్నబాబు రైతులకు సూచించారు. మండల కేంద్రంతో పాటు శివ్వాం గ్రామంలో శుక్రవారం పర్యటించి వరి పంటను పరిశీలించారు. పంటను ఆకుముడత తెగులు, కాండం తొలచు పురుగు ఆశిస్తే కార్టప్ హైడ్రో క్లోరైడ్ మందును రెండు గ్రాములను లీటరు నీటికి కలిపి ఎకరానికి రెండు వందల లీటర్ల ద్రావణం పిచికారీ చేయాలని చెప్పారు. పాముపొడతెగులు ఆశిస్తే హెక్సాకొనజోల్ లేదా వాలిడామైసిన్ మందును లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణం పిచికారీ చేయాలని వివరించారు.

17న ఆటోడ్రైవర్ల బంద్


ఆటోడ్రైవర్లతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఏఐఎస్టీయూ, ఏఐటీయూసీ నాయకులు

భోగాపురం: ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి వారంతా ఈ నెల 17వ తేదీన బంద్ నిర్వహిస్తున్నారని, వారికి అందరూ మద్దతు తెలిపి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ కోరారు. మండల కేంద్రంలోని ముక్కాం ఆటోస్టాండ్ వద్ద బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. సీఐటీయూ, ఏఐఎస్టీయూ, ఏఐటీయూసీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్త్రీశక్తి పథకం పేరిట ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న కష్టాలు, వారికి ప్రభుత్వం సాయం అందించాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేయనున్నామన్నారు. లైసెన్స్ కలిగిన ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేలు అందివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐఎస్టీయూ, ఏఐటీయూసీ నాయకులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

గజల్ వినోద్‌కు గానకోకిల అవార్డు



అవార్డు అందుకుంటున్న వినోద్

విజయనగరం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా, చినమరికి గ్రామానికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ గజల్ గాయకుడు గజల్ వినోద్‌కు గానకోకిల నంది అవార్డు లభించింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో విరూపాక్ష గార్డెన్స్‌లో గానకోకిల కళానికేతన్ వ్యవస్థాపకుడు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ సంస్థ 33వ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులను గానకోకిల నంది అవార్డులతో సత్కరించారు. ఈ క్రమంలో వినోద్‌కు ఎమ్మెల్సీ రమణ చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేశారు.

నేత్రదానానికి అంగీకారం


నేత్రదానానికి అంగీకారం తెలుపుతూ పత్రాలు చూపుతున్న వికాసతరంగిణి సభ్యులు

రాజాం సిటీ: నేత్రదానం ఆవశ్యకత తెలుసుకున్న వికాసతరంగిణి రాజాం శాఖకు చెందిన 20 మంది సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు.నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ ఆధ్వ ర్యంలో స్థానిక బొబ్బిలి రోడ్డులోని దేవిశ్రీదేవి కల్యాణ మండపంలో వికాసతరంగిణి యోగా సాధకులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్ మాట్లా డుతూ మరణానంతరం ఒకరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరి అంధులకు కంటి చూపు వస్తుం దని చెప్పారు. నేత్రదానానికి అంగీకారం తెలుపుతూ పత్రాలు అందించిన వికాస తరంగిణి సభ్యులను అభినందించారు. వికాసతరంగిణి అధ్యక్షుడు గడే అప్పలనాయుడు, సభ్యులు పల్లా నారాయణరావు, పల్లా వెంకటమధుసూదనరావు, బలగ ప్రసాదరావు, సందీప్, గంటా వెంకట నాయుడు, రెడ్డి శంకరరావు, కర్రి కన్నబాబు, సర్వేశ్వరరావు, పి.శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న రమణ

బొండపల్లి: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నూతనంగా నియమితులైన పార్టీ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని ఆ పార్టీ మండల బూత్ ఇన్‌చార్జ్ మహంతి రమణ సూచించారు. మండలంలోని కొండకిండాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారికి శుక్రవారం ఆయన నియామక పత్రాలు అందజేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు పెద్దమజ్జి గోపిని నియమించామని, అంతా సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని చెప్పారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, వేంద్రం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు,అధికారులు హాజరు కావాలని కోరారు.

8న బాడంగి మండల సమావేశం

బాడంగి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన ఉదయం 11గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

శివారు ప్రాంతాలకు సాగునీటిని అందించండి


డాక్టర్ తలే రాజేష్

రాజాం: మడ్డువలస సాగునీటి కుడికాలువ ఆయకట్టులో శివారు పంటపొలాలకు సాగునీరు అందడంలేదని రాజాం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. రాజాంలోని పార్టీ కార్యాల యంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంతకవిటి, రేగిడి మండలాల్లో మడ్డువలస థైలాండ్ వరి పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని అన్నారు. సంతకవిటి మండలంలో మండాకురిటి నుంచి దిగువ ప్రాంతాలకు నీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేస్తే ఎవరూ స్పందించడంలేదని తమకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇలానే రైతులకు సాగునీటి కష్టాలు తెచ్చిపెడితే వ్యవసాయం చేసేదెలా అని ప్రశ్నించారు. రైతులకు ఖరీఫ్‌లో అందుబాటులో ఉండాల్సిన మడ్డువలస కాలువల అధికారులు ఇలా నిర్లక్ష్యం వహించడం తగదని మండిపడ్డారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మడ్డువలస శివారు ప్రాంతాలకు సాగునీటిని అందించాలని కోరారు.

వినాయకుడి లడ్డూ రూ. 52,116


వేలంపాటలో పాల్గొన్న భక్తులు

చీపురుపల్లి: పట్టణంలోని లావేరురోడ్‌లో వరసిద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలంపాట శుక్రవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన సూరి ఉమాశంకర్ 51 కిలోల తాపేశ్వరం లడ్డూను 52,116 రూపాయలకు పాటలో దక్కించుకున్నారు. దీంతో కమిటీ సభ్యులు మేళతాళాల నడుమ లడ్డూను ఊరేగిస్తూ ఆయన ఇంటికి తీసుకెళ్లి అప్పగించారు.

చంద్రశేఖర్‌కు ఫిజిక్స్‌లో డాక్టరేట్


డాక్టరేట్ పొందిన చంద్రశేఖర్

రాజాం: పట్టణంలో మారుతీనగర్‌కు చెందిన బెజ్జిపురపు చంద్రశేఖర్‌కు ఫిజిక్స్ విభాగంలో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ పట్టా లభించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి చంద్రశేఖర్ ఈ పట్టా అందుకున్నారు. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఈయన గత ఏడేళ్లుగా ఫిజికల్ సైన్స్‌లో పరిశోధనలు చేశారు. ఆప్టో ఎలక్ట్రానిక్ వినియోగాల కోసం టీఐఫోర్‌ప్లస్, సీఓటుప్లస్, ఎంఎస్‌టుప్లస్ డోప్ చేసిన జెడ్ఎన్ఓ-బీఐటుఓత్రి- బీటుఓత్రి గ్లాసుల స్పెక్ట్రోస్కోపిక్, లక్షణాల పరిశీలన అనే అంశంపై పరిశోధన నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పలు విదేశీ జర్నల్స్‌లో నాగార్జున యూనివర్సిటీ అధికారికంగా తనకు పీహెచ్‌డీ ప్రకటించిందని వెల్లడించారు. ఇటీవల ఆ పట్టాను తనకు ప్రదానం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షణ్ముఖరావుతో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు,ఆయనకు అభినందనలు తెలిపారు.

గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న హెచ్ఎం సంగం నాయుడు

గుర్ల: మండలంలోని పాలాయవలసలో గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ గ్రంథాలయాన్ని తెట్టంగి హైస్కూల్ హెచ్ఎం రౌతు సంగంనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు ముందుకు వచ్చి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.